


# తెలుగింగ్లీష్ సంఘాలూ ఆఫ్ అమెరికా

### *అమెరికామెడీ కబుర్లు -11*

పాఠకులందరికీ నూతన సంవత్సర శుభాకాంక్షలు.. సరేలే, పోవోయ్. ఏదో పోజుకి, మొహమాటానికి ఈ సోకాల్డ్ శుభాకాంక్షలు చెప్తున్నావు కానీ, నీ సంగతి మాకు తెలియదా, అస్తమానూ ఎవరో ఒకరిని తిడుతూనే రాస్తావుగా, అలాంటిది, ఇవాళ మామీద అంత అభిమానం పుంజుకొచ్చిందంటే మేము నమ్మం సుమా అని పాఠకులు అనుకుంటే అందులో కొంత వరకూ కరెక్టే. ఎందుకంటే నాకూ అలాటి  సమస్యే ఉంది. మన ఉగాది కూడా కలుపుకుని నాకు వచ్చే సవాలక్ష నూతన సంవత్సర శుభాకాంక్షలు ఆ బాపతే అని నా అనుమానం. అనగా, నేను ఈ ఏడాదిలో ఏదో సాహితీ సదస్సు గురించో, పుస్తకాలకి విరాళాల కావాలనో, ఏదో ఒక సాంస్కృతిక కార్యక్రమానికి ఆహ్వానమో అని ఏదో వంకతో ఎన్ని ఈమైల్స్ పంపించినా ఉలకని, పలకని ఈ వీరులూ, వీర నారీ మణులూ కనీసం ఇప్పుడైనా నన్ను తలుకున్నారు కదా అని సంతోషించాలో, లేక వీళ్ళని తలుచుకుని ఈ నూతన సంవత్సర విచారంగా మొదలుపెట్టాలో తెలియక అవస్థ పడుతూ ఉంటాను.

నేను గమనించిన మరొక ప్రగాఢమైన విషయం ఏమిటంటే, ప్రతీ యేడూ ఈ టైములో "ఏమైనా సరే, ఈ కొత్త ఏడాదిలో మిలియన్ డాలర్లు సంపాదించి అవతల పారేద్దాం", "ఐశ్వర్యా రాయ్, ఇలియానాలతో మూడోస్తే ముద్దులు పెడతా టైపులో  స్టేజిమీద ఫొటో దిగుదాం" మొదలైన ప్రగాఢమైన నిర్ణయాలు తీసేసుకుని, బ్రుర గీర, చేతకాని తనం మొదలైన ప్రగాఢమైన పరిపరి కారణాలగా సంవత్సరం అంతా మొద్దు నిద్ర పోయి, మళ్ళీ కొత్త సంవత్సరం రాగానే, ఆ గ్రామఫోన్  ప్లేటే మళ్ళీ వేసుకుంటున్నాను నాకు జ్ఞానం వచ్చినప్పటినుంచీ.. "నీకు జ్ఞానం ఎప్పుడొచ్చిందోయ్ వెర్రి మోహమా,  అ యాం స్టిల్ వైటింగ్, కనీసం పేపర్లయినా సరిగ్గా చూడవు. ఐశ్వర్యా రాయ్ కి పెళ్ళయిపోయింది. స్టేజి మీద మాట దేవుడెరుగు, స్టేజి కింద ఆఖరి వరసలో కూడా ఫోటో, గిటో నై జాంతా" అంటూ మా క్వీన్ విక్టోరియా నిన్ననే విమానం ఎక్కేసింది ఇండియా వెళ్ళడానికి.  ఒక నెల పాటు నాకు "హేపీ డేస్" అని నేను ఎయిర్ పోర్ట్‌లో ఆనందపడుతూండగా "పోకిరీ " వేషాలు వెయ్యకు అని మేము ఇద్దరమూ చూడని రెండు తెలుగు సినిమాలనీ తల్చుకున్నాం.

డజను బాత్ రూం టిస్యూ రోల్స్, , గంజిపెట్టి ఉతక వలసిన తన ఫేవరైట్ కాటన్ చీరలు యాభై మొదలైన సకల లాంఛనాలతోటీ ఆవిడని విమానం ఎక్కించి నేను ఇంటికొచ్చి వంటా, పెంటా చేసి మా పిల్లల్ని భోజనానిని పిలిస్తే వాళ్ళు కూడా మదర్

విక్టోరియా నాకేసి చూసినట్టే చూసి టాకో బెలో కో, లింగ్, పింగ్ అండ్ చాంగ్ సన్స్, డాటర్స్ అండ్ మునిమనవలూ వారి చైనీస్ జిగట పదార్థాలు భుజించుటకో వెళ్ళిపోయారు.

ఏదో ఒక అమెరికాలక్షేపం చెయ్యాలిగా అనుకుంటూ భయపడుతూనే తెలుగు టీవీ ఆన్ చేశాను.. ఆ కార్యక్రమం పేరు ఫిల్మ్ న్యూస్. మీకు తెలుసుగా, వెధవ సీరియల్స్ టైములో గంగాళాలకొద్దీ కన్నీరు, మిగిలి టైములో టన్నులకొద్దీ సినిమా గోల, అవి కాక కల్చర్ పేరుతో డాన్స్ బేబీ డాన్స్ లాటి వాటిల్లో చీప్ తెలుగు ఇమిటేషన్ ఆఫ్ అమెరికన్ నల్ల వాళ్ళ పాటలూ, నృత్యాలూ. ఇదే ఈ రోజుల్లో మన టెలుగూ కల్చర్.

కిచ, కిచ లాడుతూ ఒకానొక యుక్తవయస్కురాలు మనకి ఆప్యాయంగా చెప్తున్నట్టుగా నటిస్తూ చదువుతున్న ఆ ఫిల్మ్ న్యూస్ లో నాకు ఆశ్చర్యం వేసిన వార్త ఏమిటంటే రెండు, మూడు రోజుల ముందు హైదరాబాదులో ఆటా వేడుకల మీద వార్త. యథాప్రకారం స్టేజి మీద ముఖ్య మంత్రి గారూ, ఇతర మంత్రివర్యులూ అమెరికా తెలుగు వారు ఆంధ్రప్రదేశ్‌లో పెట్టు బడులు పెట్టి, తమ అమూల్య డాలర్ సంపదని శుభ్రంగా క్షవరం చేసుకుని తరించాలని, అందుకు తాము సింగిల్ విండోపద్ధతిలో, ఏ విధమైన శ్రమా లేకుండా అన్ని విధాలుగా సహకరిస్తామనీ వాగ్దానం చేశారు..

ఫిల్మ్ న్యూస్‌లో కూడా అమెరికా తెలుగు నాయకులు కనపడగానే అమెరికా తెలుగు సంఘం వారు కూడా సినిమా వార్తలలోకి ఎక్కేసి మన తెలుగు సంస్కృతిని, భాషా సాహిత్యాలని పెంపొందింప జేస్తున్నారని నాకు తెలిసిపోయి, నా హృదయం మహదానందకండోళమయింది. అంటే నిజంగా ఏమిటో నాకూ, మీకూ తెలియదు కానీ, నా మనస్సు చాలా గందరగోళం అయినా సంతోషంగా ఉంది అని నా తాత్పర్యం.

వెను వెంటనే సినీ నటుడు మురళి మోహన్ మరొక వార్త బయటపెట్టారు. అదేమనగా, అమెరికాలో "అంటా" అనే మరొక సంస్థ వెలిసిందనీ, వారి ప్రధానోద్దేశ్యం ప్రతీ ఏడూ తెలుగు సినిమాలో ఉత్తమ నటుడు, ఉత్తమ చిత్రం, ఉత్తమ వెకిలి నటుడు మొదలైన పది కేటగిరీలలో బహుమతులు ఇస్తారనీ వివరించి, ఆ బహుమతులు నెగ్గిన వారి వివరాలు చదివారు. అవి విన్నాక నేను కూడా "పెంటా" అనే సంఘం సంస్థాపించి ఉత్తమ చెత్త చిత్రమూ, అత్యుత్తమ చెత్త నటుడూ, చెత్త ఉత్తమ నటి, చెత్తాతిచెత్త దర్శకుడూ, మహా చెత్త పాటల రచయిత, మొదలైన బహుమతులతో కని, వినీ ఎరగని స్థాయిలో తెలుగు సంస్కృతినీ, భాషనీ, సాహిత్యాన్నీ పెంపొందింప పారెయ్యాలని నిశ్చయించుకున్నాను.

ఇంతలో టెలిఫోన్ మోగగానే నేను హలో అని కూడా అనకుండానే, " ఏమన్నా చెత్తా, చెదారం రాస్తున్నావా నేను ఇంట్లో లేను కదా అని ? పిల్లలకి ఏమన్నా భోజనం పెట్టావా ? " అని నా కుశలం అడిగింది అప్పుడే ఏంస్టర్ డాం చేరిన మా క్వీన్ విక్టోరియా యూరప్ నుంచి..

ఇంతకీ ఈ "అంటా" అనే సంస్థ పూర్తి పేరు ఇంగ్లీషులో "అమెరికా ఎన్నారై తెలుగు అసోసియేషన్", కానీ తెలుగులో మటుకు "అంటా" యూ విశదీకరించబడింది. చెప్పొద్దూ, నాకు భలే తిక మకగాఉంది. ఎందుకంటే యునైటెడ్ స్టేట్స్ ఆఫ్ అమెరికాని ప్రతీ మాటకీ ముందు ఉన్న మాటని తీసుకుని, యూ.ఎస్.యే అని టూకీ గా పలుకుతాం కదా! అలాగే ఈ కొత్త ఎన్నారై సంఘాన్ని కూడా టూకీగా చెప్పాలంటే ప్రతీ పదానికీ మొదటి మాటలు రాసుకుని, "అ ఎ టె అ" అనాలి కదా, మరి ఈ "అంటా" ఎక్కడినించి వచ్చిందీ?. అందుకే నేను పెట్టబోయే సినీ సత్కార సంఘానికి అందరికీ అర్థమయ్యే పద్ధతిలో "పెంటా" అని పేరు సెలెక్ట్ చేసుకున్నాను. దాన్నే ఇంగ్లీషులో కావాలంటే "పి అనగా పిచ్చి, ఎ అనగా ఎన్నారై, అని అనేక రకాలుగా మీరు అన్వయించుకోవచ్చును. ఆఫ్టరాల్, అమెరికా ఈజె ఫ్రీ కంట్రీ !

అసలు అమెరికా అంతటా ఈ తెలుగు సంఘాల పేర్లు కనీసం ఐదు రకాలు ఉన్నాయి అని గత మూడు, నాలుగు నెలలలో స్పష్టంగా తెలిసింది. ఎందుకంటే మా నలుగురం ..అంటే ఒక సన్మాన సామ్రాట్, ఒక గాయక శిరోమణి, ఒక గాయక రత్న, మరియు ఒక చోదక సామ్రాట్ అనగా నేను.... కలిసి గత నాలుగు నెలలగా అమెరికా అంతటా ఘంటసాల ఆరాధనోత్సవాలు నిర్వహించడానికి నేను అమెరికాలోని అనేక నగరాలలో ఉన్న తెలుగింగ్లీష్ సంఘాల నాయకులూ, లేదా మాకు స్వచ్ఛందంగా సహాయం చేసే మిత్రులతో చాలా సార్లు సంప్రదింపులు చేయవలసి వచ్చింది. ఈ తతంగంలో నేను గమనించినది ఏమనగా అమెరికా తెలుగు సంఘాల పేర్లలో మొదటిది ఇంగ్లీషు పేరు. అమెరికాలో ఆదాయం పన్ను...అనగా టేక్స్ కట్టకుండా ఉండాలంటే ఈ ఇంగ్లీష్ పేరే కావాలన మాట... రెండోది తెలుగు పేరు. మూడోది ఇంగ్లీషులో టూకీ పేరు. అంటే ముద్దు పేరు అనమాట. నాలుగోది తెలుగులో పొట్టి పేరు. ఐదోది, అన్నింటికన్నా ముఖ్య మైనదీ తెలుగింగ్లీషు పేరు. కానీ మన జాతి లక్షణం ప్రకారం ఎవరూ, ఏ విధమైన రూల్స్, అంటే యూనీకోడ్, నానీకోడ్, ఎవరూవాడనీకోడ్ లాటివి పాటించరు. ఎవరి గోల వారిదే!

ఉదాహరణకి, ఒక మెగా సంస్థ పేరు ఇంగ్లీషులో తెలుగు అసోసియేషన్ ఆఫ్ నార్త్ అమెరికా. కానీ దాన్ని సంక్షిప్తంగా వ్రాసినప్పుడు, ఆ సంస్థ పత్రిక మకుటంలోనూ కూడా "తానా" అంటారు. కానీ నా లెక్క ప్రకారం ఇంగ్లీషు పేరుని టూకీగా రాయాలంటే మరి "టానా", లేదా "టేనా" అనాలి కదా. పోనీ, మాయాబజార్ లో యస్వీ రంగారావు చెప్పినట్టు "ఎవరూ పుట్టించకపోతే మాటలెలా వస్తాయ్?" అని ఈ తానా అనే కొత్తమాటని తెలుగు భాషకున్న జీర్ణశక్తి ప్రకారం మన భాషలో కలుపుకుందామే అనుకోండి. మరి, రెండో మెగా సంఘం వాళ్ళు ఒప్పుకుంటేనా? మీకు తెలుసుగా, రెండో సంఘం వారి పేరు "అమెరికా తెలుగు సంఘము" అని కదా. మరి వాళ్ళు తెలుగు అసోసియేషన్ అనే మాటకి టూకీగా తానా వారు వాడే "తా" అనే మాటని వాడుకుని తమ సంఘాన్ని "ఆతా" అని అనవచ్చుగా! కానీ వాళ్ళు "ఆటా" అంటారు కదా.

నా ఉచిత సలహా ఏమిటంటే ఒక సంఘాన్ని "తెలనాఅ", అనీ, అదే విధంగా రెండో సంఘాన్ని "అతెసం" అనీ సరయిన టూకీ పేర్లతో పున:నామకరణం చేసి తానా ని, ఆటాని సమాధి చేసి ఆ సమాధుల మీద మీద కొత్త పునాదులు వేస్తే బావుంటుందనీ, తెలుగు భాషకి న్యాయం చేకూరుతుందనీ నా అప్రస్తుత ప్రసంగం.

మరొక సారి పాఠకులందరికీ నూతన సంవత్సర శుభాకాంక్షలు.. సరేలే, పోవోయ్. ఏదో పోజుకి, మొహమాటానికి ఈ సోకాల్డ్ శుభాకాంక్షలు చెప్తున్నావు కానీ, నీ సంగతి మాకు తెలియదా........

